క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మ జాతర



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామ దళితవాడలోని గ్రామదేవత పోలేరమ్మకు శుక్రవారం జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అంబలి పోసి మొక్కులు చెల్లించారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

నేడు కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

సత్యవేడు: సత్యవేడులో జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా వ్యవసాయ అధికారులు శనివారం రైతు దినోత్సవం నిర్వహించనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి, రైతు సలహా సంఘం అధ్యక్షుడు కే. శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రైతులకు క్రాప్ ఇన్సూరెన్సు మెగా చెక్కు పంపిణీ, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ప్రారంభిస్తారని చెప్పారు. తొలుత మూడు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తారని, అన్నదానం చేస్తారని పేర్కొన్నారు.

ముక్కంటి గోశాలకు వితరణ



ఆవు, దూడను అందజేస్తున్న వెంకటలక్ష్మి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ గోశాలకు బెంగళూరుకు చెందిన ఎ.వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువ గల ఆవు, దూడతో పాటు వాటి సంరక్షణకు రూ.30వేల విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం దాత కుటుంబ సభ్యులకు గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భూముల రీ సర్వేపై గ్రామసభలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని చోడవరం, సిద్ధిగుంట గ్రామాల్లో శుక్రవారం భూముల రీ సర్వేపై తహసీల్దార్ ఎర్రంరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో వీలైనంత త్వరగా భూముల రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. అనంతరం భూముల రీ సర్వే పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌టీడీ వసంత్‌రాజ్, మండల సర్వేయర్ మోహన్ కృష్ణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర ప్రదర్శన

ఏర్పేడు: తెగుళ్ల శాతాన్ని బట్టి తగిన మోతాదులో పురుగు మందులు పిచికారీ చేయాలని ఇఫ్‌కో సంస్థ జిల్లా క్షేత్ర స్థాయి అధికారి దిలీప్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని మునగలపాలెంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం, నానో ఎరువుల వాడకం, సామర్థ్యంపై రైతులకు అవగాహన కల్పించారు. రాస్ సభ్యుడు శంకర్‌నాయుడు, రైతులు పాల్గొన్నారు.

కుంభాభిషేకం

నారాయణవనం: స్థానిక బంగళాతోపులో నూతన మాతమ్మ ఆలయ కుంభాభిషేకం వేడుకలు శుక్రవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు.గురువారం విఘ్నేశ్వర పూజతో కలశాలను ఏర్పాటు చేసి, వాస్తు, గణపతి, నవగ్రహ, మహాలక్ష్మి హోమాలను చేశారు. శుక్రవారం హోమశాలలో పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ విమాన గోపురంపై కలశానికి అభిషేకం, మహా కుంభాభిషేకాన్ని పూర్తి చేశారు.

రేషన్ పంపిణీలో జాప్యం

కేవీబీపురం: సజావుగా సాగుతున్న రేషన్ పంపిణీలో జాప్యం చోటు చేసుకుంది. గత నెల వరకు రేషన్ పంపిణీ ఈపాస్ మెషిన్ ద్వారా రోజుకు 200 మంది కార్డుదారులకు బియ్యం సరఫరా చేశారు. జూలై నుంచి ఈపాస్ మెషిన్ న్యూ వెర్షన్ విడుదల చేయడంతో సాంకేతిక లోపాల కారణంగా తీవ్ర జాప్యం జరుగుతోందని స్థానిక ఎండీయూ ఆపరేటర్లు డిప్యూటీ తహసీల్దారు మునిరత్నంకు విన్నవించారు. న్యూవెర్షన్‌ను తొలగించి పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీకి అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు వెట్టి భాగ్యరాజ్, ఈసీ మెంబర్ నాగయ్య, రమేష్, గోపి, భాను, పరశురాం, పురుషోత్తంరెడ్డి, రాంకీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

పల్లె చెంతకే పాలన

- సచివాలయాలతో సత్వర సేవలు
- పథకాల మంజూరుకు అర్హతే ప్రామాణికం
- కష్టాలు తప్పాయని ప్రజలు హర్షం

సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా పల్లెలు పయనిస్తున్నాయి. ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి హోదాలో ఆయన నెరవేర్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. రూ.కోట్లతో శాశ్వత భవనాలు నిర్మించారు. ఫలితంగా ప్రజలు సమస్యల పరిష్కారానికి కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి వెళ్లే అవసరం తప్పింది. స్వగ్రామాల్లోనే సేవలన్నీ లభిస్తుండడం, సత్వరమే పరిష్కారం అవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.





అంజిమేడు సచివాలయం, లబ్ధిదారునికి నగదును అందిస్తున్న వలంటీర్ మల్లిఖార్జున్(ఫైల్)

ఏర్పేడు: మండలంలో మొత్తం 19 సచివాలయాలు ఉన్నాయి. మొత్తం జనాభా 43,856. సచివాలయ ఉద్యోగులు 158 మంది, వలంటీర్లు 309 మంది పనిచేస్తున్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ సేవలను అందిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షలు, వైఎస్సార్ హెల్త్ సెంటరుకు రూ.17.3 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.23 లక్షలు హెచ్చించి భవనాలను నిర్మించింది.

నాడు అలా..

గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఏ చిన్న పని కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అంతేకాకుండా వ్యయప్రయాసలకు గురయ్యేవారు. పింఛను, కొత్త రేషన్ కార్డులు పొందాలన్నా ఏళ్ల తరబడీ ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. పింఛను దారుల కష్టాలైతే చెప్పనలవి కావు. సకాలంలో నగదు అందక పడిగాపులు కాయాల్సి వచ్చేది.

నేడు ఇలా..

సచివాలయ వ్యవస్థ ద్వారా సమస్యలు పరిష్కారం కావడంతో పాటు 500 రకాల పైచిలుకు సేవలు పల్లె ముంగిటకే అందుబాటులోకి వచ్చాయి. రోజుల వ్యవధిలోనే అవసరమైన సర్టిఫికెట్లను స్వంత గ్రామాల్లో పొందుతున్నారు. వలంటీర్ వ్యవస్థ మూలాన ప్రతి నెలా ఒకటో తేది తెల్లవారక ముందే లబ్ధిదారులకు పింఛను అందుతోంది.

మండలానికి వెళ్లే పనిలేదు



సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం మండలానికి వెళ్లే పనిలేకుండా పోయింది. వలంటీర్ ద్వారా సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నాం. కొన్ని రోజుల వ్యవధిలో ఆయా ఇవి అందాయి. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన వారికే సంక్షేమ పథకాలు అందుతుండేవి.

–గోపి, రైతు, ఎండీపుత్తూరు, ఏర్పేడు

తెల్లవారక ముందే పింఛను



సచివాలయ వ్యవస్థతో ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారక ముందే వలంటీర్ ఇంటికి వచ్చి, పింఛను నగదు ఇస్తున్నాడు. గత ప్రభుత్వ పాలనలో ఎప్పుడిస్తారు దేవుడా? అని పింఛను సొమ్ము కోసం ఎదురు చూడాల్సివచ్చేది.

–అనసూయమ్మ, ఆమందూరు బీసీ కాలనీ, ఏర్పేడు

సేవలు భేష్



సచివాలయాల్లో సేవలు చాలా బాగున్నాయి. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్న కొన్ని రోజులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మండల కేంద్రానికి వెళ్లి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది.

–రామచంద్రయ్య, ఎండీపుత్తూరు, ఏర్పేడు

సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ ఏఎస్ఆర్ కాలనీలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడంతో పాటు తనపై దాడి చేసి కులం పేరుతో దుర్భాషలాడిన సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రెండో వార్డు సభ్యురాలు ధనమ్మ కోరారు. ఆమె శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తాను 30 ఏళ్లుగా సోషల్ వర్కర్‌గా బలహీన వర్గాల సంక్షేమం కోసం పని చేస్తున్నానని తెలిపారు. కాలనీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం మంజూరు చేయాలని సర్పంచ్‌ను పలు మార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. దీంతో తూకివాకం హరిజనవాడ సమీపంలో సర్పంచ్ అనుమతి లేకుండా తాను అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రయత్నించానన్నారు. గ్రామ పంచాయతీ సమస్యలు, నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించానన్న కక్షతో తనను కులం పేరుతో దుర్భాషలాడుతూ విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటున్నారని వాపోయారు. ఈ విషయమై పోలీసులకు, స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సర్పంచ్ నుంచి తనకు రక్షణ కల్పించడంతో పాటు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులిశ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, దళిత నేతలు చలపతి, రమేష్, భాస్కర్, దేవా, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రైల్వేకోడూరు(అన్నమయ్య జిల్లా): తిరుపతి జిల్లా కరకంబాడి దొడ్లమిట్టకు చెందిన నీలకంఠం రాజు హత్య కేసులో నిందితుడు రైల్వేకోడూరు మండలం మాధవరంపోడుకు చెందిన గూడూరు సుబ్రమణ్యం రాజును అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. 2022 ఏప్రిల్ 9న రాత్రి 9.30 గంటల సమయంలో మాధవరంపోడు గ్రామంలో ఆస్తి విషయంలో గూడూరు సుబ్రమణ్యం రాజు, అతని వదిన పుష్పలత గొడవపడ్డారని తెలిపారు. ఈ విషయంలో మాట్లాడటానికి వచ్చిన పుష్పలత అన్న నీలకంఠంరాజును గూడూరు సుబ్రమణ్యంరాజు, అతని భార్య ఇద్దరు కలిసి తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలయినట్టు పేర్కొన్నారు. కొట్టిన గాయాల నుంచి కోలుకోలేక 2022 జూన్ 6న తిరుపతి జిల్లా కరకంబాడి దొడ్లమిట్టలోని తన ఇంట్లోనే చనిపోయినట్టు చెప్పారు. నీలకంఠంరాజు తండ్రి అనంతరాజు కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న గూడూరు సుబ్రమణ్యం రాజును గురువారం రాత్రి రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట జెడ్పీ హైస్కూల్ వద్ద అరెస్ట్ చేసినట్టు చెప్పారు. శుక్రవారం కోడూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండు విధించినట్టు వివరించారు.

రోగులతో బాధ్యతగా మెలగాలి



డాక్టర్ లావణ్య

వరదయ్యపాళెం: వైద్యం కోసం వచ్చే రోగులతో ఆరోగ్య కార్యకర్తలు బాధ్యతగా మెలగాలని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారిణి లావణ్య అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో శ్రీసిటీలోని చాక్లెట్ తయారీ పరిశ్రమ మోండలెజ్ సేవ్ ద చిల్డ్రన్స్ సంస్థ సంయుక్తంగా ఆశావర్కర్లకు, ఏఎన్ఎంలకు జెండర్ రెస్పాన్సివ్, సోషల్ ఇన్‌క్లూసివ్ గురించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైద్యాధికారిణి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్య కార్యకర్తలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్నవి క్షేత్రస్థాయిలో పాటించాలన్నారు. సేవ్ ద చిల్డన్స్ మేనేజర్ బాలాజీ, కో–ఆర్డినేటర్ హేమంత్, సూపర్‌వైజర్ కిరణ్ కుమారి, సంస్థ ప్రతినిధులు రాజేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు వచ్చి..!

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమిళనాడు యువకులు
- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



మరణించిన నాగరాజు

వరదయ్యపాళెం: ఒకే బైక్‌పై నలుగురు ప్రయాణం.. ఆపై మితిమీరిన వేగం ప్రమాదానికి దారితీసింది. అదుపు తప్పి పడిపోవడంతో వారంతా గాయపడ్డారు. తీవ్రగాయాలతో ఒకరు ఆస్పత్రిలో మరణించారు. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. సత్యవేడు సమీపంలోని తమిళనాడు మాదరపాకం ప్రాంతానికి చెందిన నాగరాజు (21), గణేష్ (19), శివమణి (15), మనస్వామి (20) వరదయ్యపాళెంలో జరిగిన వాలీబాల్ పోటీలలో శుక్రవారం పాల్గొన్నారు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలోని చిన్న పాండూరు సమీపంలోని నక్కలమిట్ట వద్ద అదుపు తప్పి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో ఆ నలుగురికీ గాయాలయ్యాయి. నాగరాజుకు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. వీరికి చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి నాగరాజు మృతిచెందాడు. ఇదలా ఉంచితే, వీరంతా ఒకే స్కూటీపై ప్రయాణించడం, వేగంగా వెళ్లడమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు తెలిసింది. సమాచార అందుకున్న ఎస్ఐ అక్కడికి చేరుకుని పరిశీలించారు. యువకుల కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు బంగ్లాకొచ్చిన జెర్రిపోతు!



నగరి: కోర్టు బంగ్లా ఆవరణలో శుక్రవారం రాత్రి 6 అడుగుల జెర్రిపోతు ప్రత్యక్షమైంది. బంగ్లా చుట్టూ చెట్ల పొదలు ఉండడంతో అక్కడి నుంచి బంగ్లాలోకి జెర్రిపోతు ప్రవేశించింది. దానిని కోర్టు సిబ్బంది హడలిపోయారు. వెంటనే జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ పుత్తూరు నుంచి స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌ను రప్పించారు. ఆ జెర్రిపోతును అతను చాకచక్యంగా పట్టేయడంతో కోర్టుసిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. పామును అటవీ ప్రాంతంలో వదలిపెడతానని స్నేక్ క్యాచర్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తిరుపతి రూరల్ ట్రాన్స్‌కో ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడు కండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ



శ్రీకాళహస్తి: ఐసీఈయూ 73వ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా మండలంలో భైరవ ఎస్టీ కాలనీలోని 50మంది విద్యార్థులు ఎల్ఐసీ శ్రీకాళహస్తి నాయకులు సురేష్‌బాబు విద్యాసామగ్రిని అందజేశారు. శుక్రవారం యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జహంగీర్, శ్రీనివాసులు, బాలాజీ, సాయి, ఆనంద్, వెంకటేష్, యుగంధర్, వలంటీర్లు వెంకటేష్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ, అంబుడ్స్‌మెన్

పిచ్చాటూరు: ఉపాధి కూలీలకు గరిష్ట కూలి వచ్చేలా రోజువారీ పనులు చేయించాలని అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, క్లస్టర్ ఏపీడీ సరిత ఆదేశించారు. శుక్రవారం వారు నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఉపాధి పనుల్లో అవకాశం కల్పించాలన్నారు. 100 రోజుల పనిదినాలు పూర్తి చేయించాలన్నారు. పండ్ల తోటలు, పూల తోటలు సాగు చేసేందుకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓలు సుధాకర్, నాగభూషణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలో ఉపాధి హామీ పనులలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కువ పనులు కల్పించాలని అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సోషల్ ఆడిట్‌లో వచ్చిన రికవరీలను చెల్లించాలని ఆదేశించారు. శ్రీకాళహస్తి క్లస్టర్ సహాయ పథక సంచాలకులు ప్రేమ్‌కుమార్, ఏపీఓ సుజాత పాల్గొన్నారు.

ఈ వృద్ధురాలు ఎవరో..?



కేవీబీపురం: సుమారు 60 ఏళ్ల కలిగిన ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మండలంలోని ఆరె బంగారమ్మ గుడి వద్ద నాలుగురోజులుగా ఆకలితో అలమటిస్తోంది. గమనించిన స్థానికులు ఆమె గురించి ఆరా తీశారు. తనది నెల్లూరు జిల్లాలోని కావలి నియోజకవర్గం జల్లపాళెం గ్రామమని, తన కొడుకు పేరు మాధవరావు, కోడలు పేరు శాంతి అని చెబుతోంది. అంతేకాకుండా పదిరోజుల క్రితం తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబంతో సహా వచ్చామని, బస్టాండు వద్ద తప్పిపోయినట్లు పేర్కొంటోంది. అక్కడికి నుంచి కేవీబీపురానికి ఎలా వచ్చిందనేది స్పష్టంగా చెప్పడం లేదు. ఆమె క్షుద్బాధను ఓ వృద్ధురాలు తీర్చింది. స్థానిక వలంటీర్ తిరుమలకు వృద్ధురాలి గురించి తెలియజేసింది. ఇక, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదనే విమర్శలొస్తున్నాయి.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొరబాబు ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు గౌరి భాస్కర్, బాల, వెంకటరమణ, నరేష్, ఆజాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సేవలు

- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: అర్హులందరికీ ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. శుక్రవారం నాగలాపురం మండలం బయట కొడియంబేడు సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 422 మందికి 11 సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను ఆయన అందజేసి మాట్లాడా రు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల సమస్యలను ప్రజల ముంగిటే పరిష్కారించేందుకు జగనన్న సురక్షను సీఎం ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదన్నారు. అందుకే మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఉపాధి ఏపీడీ సరిత, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, సర్పంచ్ మదన్ రెడ్డి, వైఎస్సార్ టీయూసీ చైర్మన్ ఎస్ఎం సురేష్, నాయకులు శ్యామ్, మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు సత్కారం

నాగలాపురం మండలంలో ఉద్యోగోన్నతులు, బదిలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులను స్థానిక వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు.

నివాళి

పిచ్చాటూరు మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కృష్ణంరాజు శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కీళ్లపూడికి వెళ్లి, కృష్ణంరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముత్యాలమ్మకు వెండి కలశం సమర్పణ



కలశాన్ని అందజేస్తున్న గోపాల్‌రెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ముత్యాలమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన గోపీకృష్ణ హోటల్ నిర్వాహకులు గోపాల్‌రెడ్డి దంపతులు రూ.1.15లక్షల విలువ గల 300 గ్రాముల వెండి కలశాన్ని సమర్పించారు. దీనిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్హులందరికీ లబ్ధి



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి సైతం లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టిందని, తద్వారా అర్హులకు సంక్షేమ పథకాలు, అవసరమైన సర్టిఫికెట్లు అందివ్వడమే ముఖ్యోద్దేశమని ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దారు భార్గవి చెప్పారు. శుక్రవారం ఆలత్తూరులో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. వివిధ సర్టిఫికెట్లు, సమస్యలపై మొత్తం దరఖాస్తులు 542 అందగా, కుల ధ్రువీకరణ పత్రాలు 279, ఆదాయం సర్టిఫికెట్లు 216, రేషన్ కార్డు 1, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ 1, మరణ ధ్రువీకరణ పత్రం1, జనన ధ్రువీకరణ పత్రం 1, కౌలు రైతుల సర్టిఫికెట్లు 5 అందజేశారు. అలాగే ఆధార్ మొబైల్ అనుసంధానం 11 చేశారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఏఓ త్రివిక్రమ్‌రావు, ఎంఎల్ఓ ప్రసాద్, సర్పంచులు చంద్రారెడ్డి, వీఆర్ఓ భాస్కర్, గ్రామ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యాయానికి నాంది



సర్టిఫికెట్లు అందజేస్తున్న పవిత్రారెడ్డి, వైస్ ఎంపీపీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): 'జగనన్న సురక్ష'తో ప్రభుత్వం నూతన అధ్యాయానికి నాంది పలికిందని మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. శుక్రవారం సాంబయ్యపాలెం, బసవయ్యపాళెం సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ఆమె వివరించారు. బసవయ్యపాళెంలో 1069, సాంబయ్యపాళెంలో 780 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ, సర్పంచ్ సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కాపిరెడ్డి ఢిల్లీ బాబురెడ్డి, నాయకులు కోవి చంద్రయ్య నాయుడు, జగదీశ్వర్ రెడ్డి, శివారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బలరాం రెడ్డి, రమేష్, మాతయ్య, వెంకటేశ్వర నాయుడు, జీవీ.నాయుడు, మణినాయుడు, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌బాబు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

180మందికి ధ్రువీకరణ పత్రాలు





కేవీపురం: గుంటిపేడులో.., ఏర్పేడు : సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ తిరుమలయ్య

కేవీబీపురం: మండలంలోని గుంటిపేడులో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 180మంది లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య పంపిణీ చేశారు. 17మంది ఒంటరి మహిళలకు పింఛన్లు, 70 కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు ఇతర సర్టిఫికెట్లను ఇచ్చినట్లు ఆయన చెప్పారు.ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ శాస్త్రిరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బుర్రా మాధవిరెడ్డి, స్థానిక సర్పంచ్, నాయకులు బుచ్చిబాబు, పిడుగు ప్రకాష్, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దారు శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి, ఆమందూరు సచివాలయాలు, ఎండీపుత్తూరులో జగనన్న సురక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ తిరుమలయ్య అర్హులైన వారికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌లు మునిరామయ్య, మోహనప్రియ, మోహన్‌రెడ్డి, పెంచలయ్య, నారాయణ, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, పార్టీ నాయకులు రామయ్య ఆచారి, చెంగారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి జ్యోతి, ఎంపీడీఓ గిడ్డయ్య, మహిళలు పాల్గొన్నారు.



నారాయణవనం : కొండలచెరువులో..

నారాయణవనం: మండలంలోని కొండల చెరువు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి, ఎంపీపీ దివాకర్‌రెడ్డి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కొండలచెరువు, కళ్యాణపురం పంచాయతీల ప్రజల నుంచి 689 అర్జీలు అందాయి. వీటిలో 378 సమస్యలను పరిష్కరించినట్లు ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల చెప్పారు. కొండలచెరువు పంచాయతీ పరిధిలోని భూములు, ఇంటి స్థలాలు పుత్తూరు రెవెన్యూ పరిధిలోకి రావడంతో కొనుగోళ్లు, అమ్మకాలకు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరారు. జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, సర్పంచ్‌లు భూపాల్‌రెడ్డి, మునెమ్మ, పళణిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.